# పెండ్లయిన యేడాదికే..

## అనుమానాస్పదంగా వివాహిత మృతి


సాయి శ్రీ సరస్వతి(ఫైల్)

ఎదులాపురం, జూన్ 30 : ఆదిలాబాద్ పట్టణంలోని దుర్గనగర్‌కు చెందిన సాయి శ్రీ సరస్వతి, రూరల్ మండలంలోని భీంసారి గ్రామానికి చెందిన లింగాల నరేశ్‌లు గతేడాది ప్రేమ వివాహం చేసుకున్నారు. కొద్ది రోజులుగా నరేశ్ పనిచేయకుండా ఖాళీగా ఉంటున్నాడు. ఈ మధ్య మద్యానికి బానిసయ్యాడు. భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం రాత్రి సరస్వతి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సరస్వతి తల్లి అరుణ ఫిర్యాదు మేరకు భర్త, అత్త రాధ, మరిది హరీశ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ముజాహిద్ తెలిపారు. ప్రేమ పెళ్లి చేసుకుని యేడాదికే అనుమానాస్పదంగా మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

# వెబ్ ఆప్షన్ కోసం ప్రత్యేక కంప్యూటర్లు ఏర్పాటు



ఎదులాపురం, జూన్ 30: ఎస్జీటీ ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియలో భాగంగా వెబ్ ఆప్షన్‌లో ఇబ్బందులు ఉండకూడదని సంఘం తరపున కంప్యూటర్లు ఏర్పాటు చేశామని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు స్వామి తెలిపారు. ఆదివారం విద్యానగర్‌లో ఎస్జీటీ ఉపాధ్యాయుల వెబ్ ఆప్షన్ కోసం ప్రత్యేకంగా కంప్యూటర్లను ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించామన్నారు. నెట్ సౌకర్యాలున్న బాధ్యులు కూడా వారివారి పరిధిలో ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. శనివారం రాత్రి నుంచి వెబ్ ఆప్షన్ ప్రారంభమైందని, ఆదివారం రాత్రి 10 గంటల వరకే ఓపెన్ ఉంటుందని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, ఉపాధ్యక్షురాలు సురేఖ, రాష్ట్ర కమిటీ సభ్యుడు లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.


రాథోడ్ రమేశ్ అంతిమయాత్రలో పాల్గొన్న కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు


రాథోడ్ రమేశ్(ఫైల్)

# ఇక సెలవు..

## రాథోడ్ రమేశ్ అంతమయాత్రలో పాల్గొన్న భారీ జనం

ఉట్నూర్, జూన్ 30 : గిరిజన నాయకుడు, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అంతమయాత్రను ఆదివారం ఉట్నూర్ మండలంలోని నాగాపూర్ గ్రామ సమీపంలో నిర్వహించారు. గుండెపోటుతో బాధపడుతూ హైదరాబాద్‌కు తరలిస్తుండగా కన్నుమూసిన విషయం తెలిసిందే. అనంతరం మృతదేహాన్ని ఉట్నూర్‌లోని ఆయన నివాసానికి తరలించి ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఆదివారం చివరిచూపు చూసేందుకు జనం తండోపతండాలుగా వచ్చారు. అనంతరం ఆయన నివాసం నుంచి మండలంలోని నాగాపూర్ గ్రామం వద్ద ఉన్న ఆయన చేనులో ఖననం చేశారు. ఉట్నూర్ నుంచి సుమారు ఎనిమిది కిలోమీటర్ల మేర అంతిమయాత్రలో ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

### నివాళులు అర్పించిన నాయకులు

మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అకాల మరణంతో కార్యకర్తలు, అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయారు. మరణ వార్త తెలుసుకున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, మెదక్ ఎంపీ ఈటెల రాజేందర్, ఎంపీ గోడం నగేశ్, జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే శంకర్, మాజీ మంత్రులు ఐకే రెడ్డి, వేణుగోపాలాచారి, మాజీ ఎమ్మెల్యే బాపూరావ్‌లు నివాళులు అర్పించారు. అలాగే ఉమ్మడి జిల్లాలోని బీజేపీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు, అభిమానులు చివరి చూపు కోసం బారులుదీరారు. అలాగే పట్టణంలో వ్యాపారులు సంపూర్ణంగా బంద్ నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్


అంతిమయాత్రలో పాల్గొన్న ఎంపీ నగేశ్, ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, పాయల్ శంకర్, జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, నాయకులు

# రైతుబంధుపై రంది

## సాగు ప్రారంభమైనా అందని సాయం

- విధి విధానాలు ఖరారు కాలేదంటున్న అధికారులు
- నిర్మల్ జిల్లాలో 1.83 లక్షల మంది ఎదురుచూపు
- మళ్లీ వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్న అన్నదాతలు
- కేసీఆర్ పాలనే నయమంటున్న రైతాంగం

నిర్మల్, జూన్ 30(నమస్తే తెలంగాణ) : రైతుబంధు డబ్బుల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం పదేళ్లుగా యేటా రెండు పంటలకు ఎకరానికి రూ.10 వేల చొప్పున పెట్టుబడి సహాయాన్ని అందించింది. ఎన్నికల హామీలో భాగంగా రెండు సీజన్‌లకు ఎకరాకు రూ.15 వేలు అందిస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హామీని బుట్టదాఖలు చేసింది. గత యాసంగిలో కొంత మందికే సాయాన్ని అందించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. వానకాలం సీజన్‌కు సంబంధించిన పెట్టుబడి సాయాన్ని అందించేందుకు అనేక ఆంక్షలు అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. రైతుల నుంచి అభిప్రాయ సేకరణ పేరిట అమలును జాప్యం చేసేందుకు యత్నిస్తున్నదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో 1.83 లక్షల మంది రైతులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతమంది రైతులకు రైతుబంధు ఇస్తుందో అన్న విషయంపై స్పష్టత లేదు. వానకాలంలో రైతులు అప్పులు చేసి సాగుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే 80 శాతానికి పైగా సోయా, పత్తి, మక్క, పప్పు దినుసుల పంటలు పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. గత వారం రోజులుగా వర్షాలు సమృద్ధిగా కురుస్తున్న నేపథ్యంలో మరో వారం రోజుల్లో బోరుబావుల కింద వరి నాట్లను ప్రారంభించేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.


తానూర్ మండలంలో మొలకెత్తిన సోయా విత్తనాలు

### ముందుచూపు లేని సర్కారు

రైతుబంధుపై రాష్ట్ర ప్రభుత్వానికి ముందుచూపు లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పెట్టుబడి సహాయాన్ని మే నెలాఖరులో లేదా జూన్ మొదటి వారంలో అందిస్తే విత్తనాలు, ఎరువులు, ఇతర ఖర్చులకు ఉపయోగపడేవని రైతులు చెబుతున్నారు. అప్పులు చేసి సాగు చేసిన తర్వాత సహాయాన్ని అందించినా ప్రయోజనం ఏమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ముందస్తుగా పెట్టుబడి సహాయాన్ని అందిస్తే సాగు సకాలంలో పూర్తయి దిగుబడులు కూడా పెరిగే అవకాశం ఉందంటున్నారు. సమయానికి చేతిలో చిల్లిగవ్వ లేక చిన్న, సన్నకారు రైతులు పంటల సాగును ఆలస్యం చేయడంతో చివరి దశలో చీడపీడలు ఆశించి తీవ్రంగా నష్టపోతున్నారు. మరోవైపు బ్యాంకులో తీసుకున్న రుణాలు మాఫీ కాకపోవడం, కొత్త రుణాలు ఆలస్యం కావడంతో పెట్టుబడి కోసం రైతులు దిక్కులు చూడాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. కాగా.. కొందరు రైతులు బంగారు నగలను కుదువ పెట్టి పెట్టుబడి సహాయాన్ని సమకూర్చుకుంటున్నారు. ఇదిలా ఉంటే కొంతమంది దళారులు రైతుల అవసరాన్ని ఆసరా చేసుకుంటూ అధిక వడ్డీలకు అప్పులిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. చేసిన కష్టమంతా దళారులపాలవుతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వెంటనే రైతుబంధు సాయాన్ని అందజేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని రైతులు డిమాండ్ చేస్తున్నారు.


కుభీర్ మండలం పల్సిలో ఏపుగా పెరిగిన పత్తి

### అప్పు చేసి పంటలు వేసిన..



నాకు తానూర్ శివారులో ఏడెకరాల వ్యవసాయ భూమి ఉన్నది. ఐదెకరాల్లో పత్తి, రెండెకరాల్లో సోయా వేసిన. ఈ నెల మొదటి వారంలో వర్షాలు పడగానే పత్తి వేసిన. 15 రోజుల కింద సోయా అలికిన. ఇప్పటికైతే పంటలు మంచిగనే ఉన్నయి. రైతుబంధు రాకపోవడంతో అప్పులు తెచ్చి పంటలు వేసిన. ట్రాక్టర్‌తో దుక్కులు, ఎరువులు, విత్తనాలు, కూలీల కోసం తెలిసిన కాడ రూ.50 వేలు బాకీ చేసిన. సకాలంలో రైతుబంధు ఇవ్వకుండా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తున్నది.

*- పంగి గంగారెడ్డి, రైతు, తానూర్.*

### కేసీఆరే బాగా చేసిండు..



కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు దాటినా రైతులకు ఒక్క మంచి పని చేయలేదు. గత యాసంగిలో రైతుబంధు కొందరికే ఇచ్చిన్రు. వానకాలం రైతుబంధు ఇంకా రాలేదు. ఎప్పుడు వస్తదో తెల్వదు. ఆరు ఎకరాల్లో మక్కపంట వేసిన. ఖర్చులు తడిసిమోపెడైనయ్. కేసీఆర్ పాలనలో టైంకు రైతుబంధు అందుతుండే. రైతుల కష్టం తెలిసిన కేసీఆరే రైతులకు అన్నీ బాగా చేసిండు. ప్రతి ఒక్క రైతుకు రైతుబంధు ఇచ్చిండు. ఎరువులు, విత్తనాల కోసం తిప్పలు లేకుండే. రైతులకు కేసీఆర్ పాలనే బాగుండే.

*- ఆలూరి శ్రీనివాస్‌రెడ్డి, రైతు, సిద్దులకుంట.*











# నేటి నుంచి 30 పోలీస్ యాక్టు అమలు

నిర్మల్ అర్బన్, జూన్ 30 : నిర్మల్ జిల్లా వ్యాప్తంగా శాంతి భద్రతలను దృష్టిలో పెట్టుకుని నేటి(సోమవారం) నుంచి 31వ తేదీ వరకు నెల రోజులపాటు 30 పోలీస్ యాక్టును అమలు పరుస్తున్నట్లు ఎస్పీ జానకి షర్మిల ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, ర్యాలీలు నిర్వహించరాదని హెచ్చరించారు. శాంతి భంగం కలిగించడం, పబ్లిక్ స్థలాల్లో డీజేలు, మ్యూజిక్‌లు, ప్రసంగాలు నిషేధమని, ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు గమనించి పోలీసులకు సహకరించాలని కోరారు.


సమావేశానికి వచ్చిన మహిళా రైతులు

# భరోసా లేని సభలు

## రైతు భరోసా సమావేశాలకు స్పందన కరువు

నేరడిగొండ, జూన్ 30 : పై చిత్రం చూశారా.. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ రైతువేదికలో ఆదివారం నిర్వహించిన రైతుభరోసా సభకు హాజరైన రైతులు. ఐదుగురు మహిళలు, నలుగురు పురుషులు మాత్రమే ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా కోసం రైతుల నుంచి సూచనలు, సలహాలు తీసుకోవడం ఏర్పాటు చేశామని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో స్పందన అంతంత మాత్రంగానే ఉంటున్నది. ప్రభుత్వంపై నమ్మకం లేకపోవడమే నిదర్శనం. ఈ సమావేశానికి పీఏసీఎస్ చైర్మన్ కిశోర్‌సింగ్, వైస్ చైర్మన్ వెంకటరమణ, సీఈవో నాగభూషణ్, తదితరులు పాల్గొన్నారు.

# గుట్కాపై ఉక్కుపాదం

- నిర్మల్ జిల్లా వ్యాప్తంగా నిఘా
- పెద్ద ఎత్తున పట్టుబడుతున్న గుట్కా
- పోలీసుల మెరుపు దాడులు
- అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద బందోబస్తు

నిర్మల్ అర్బన్, జూన్ 30 : ప్రజారోగ్యానికి హాని కలిగించే నిషేధిత గుట్కాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. గుట్కా వ్యాపారం, అమ్మకాలను పూర్తిగా నియంత్రించేందుకు పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు నిఘాను పటిష్ట పర్చారు. ఇందులో భాగంగా తాజాగా నిర్మల్ జిల్లా కేంద్రంలోని అన్ని వ్యాపార దుకాణ, గోదాముల్లో దాడులు జరిపించారు. పెద్ద ఎత్తున నిషేధిత గుట్కాను పట్టుకున్నారు. దీంతోపాటు నిర్మల్ జిల్లాకు అంతరాష్ట్ర(మహారాష్ట్ర) సరిహద్దు ప్రాంతాలైన తానూర్(బేల్తరోడ), సారంగాపూర్ (రాంసింగ్ తండా) వద్ద గల అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద పోలీసులు నిఘాను పటిష్టం చేశారు. ఇతర రాష్ట్రాలలో గుట్కాపై నిషేధం లేకపోవడంతో ఇక్కడి ప్రాంతాల్లో నిషేధం ఉండడంతో కొందరు వ్యాపారులు అక్రమార్జనకు తెరలేపారు. తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయం అర్జించాలనే అత్యాశతో వ్యాపారంలోకి దిగుతున్నారు. పోలీసులు నిఘాను పటిష్టం చేయడంతో పట్టుబడుతున్నారు.

### నిర్మల్ జిల్లాలో జరిగిన ఘటనలు..

- ఇటీవల భైంసా పట్టణంలో దాదాపు 6 లక్షల విలువ చేసే గుట్కాను స్వాధీనం చేసుకున్నారు.
- నిర్మల్ పట్టణంలోని నారాయణరెడ్డి మార్కెట్, పాత, కొత్త బస్టాండ్ ప్రాంతాల్లోని దుకాణాలు, గోదాముల్లో తనిఖీలు నిర్వహించారు. దాదాపు రూ.5.50 లక్షల విలువ చేసే గుట్కా పట్టుబడింది.
- గతంలో మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలైన సారంగాపూర్ మండలంలో నెల వ్యవధిలోనే రూ.12 లక్షల విలువ చేసే గుట్కా ప్యాకెట్‌లను పోలీసులు పట్టుకున్నారు.
- నిర్మల్ పట్టణంలోని శివారు కాలనీలో గల ఇంట్లో నిలువ చేసిన రూ.5 లక్షల విలువ చేసే గుట్కా ప్యాకెట్‌లను స్వాధీనం చేసుకున్నారు.
- సారంగాపూర్ మండలంలో బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న రూ.10 లక్షల విలువ చేసే గుట్కాను సీజ్ చేశారు.


దుకాణాల్లో తనిఖీలు చేపడుతున్న పోలీసులు(ఫైల్)

### వాహన రాకపోకలపై నిఘా

ఇతర రాష్ట్రాల నుంచి మన రాష్ట్రం(నిర్మల్ జిల్లాలకు) వచ్చే వాహన రాకపోకలపై దృష్టి సారించారు. వాహన నంబర్లను రికార్డు చేస్తూ క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ఎక్కడి నుంచి వాహనం వస్తున్నది? ఎక్కడికి వెళ్తున్నది? వాహనంలోని సరుకుల వివరాలను పోలీసులు నమోదు చేస్తున్నారు. పట్టుబడిన వాహనాలను ఉన్నతాధికారులకు అప్పగిస్తున్నారు. అంతేకాకుండా శివారు ప్రాంతాల్లో అద్దెకు తీసుకుని నిల్వ ఉంచుతున్న గోదాములపై కూడా దృష్టి సారించారు.

### పటిష్ట నిఘా పెట్టాం..



*నిర్మల్ జిల్లాలో నిషేధిత గుట్కా అమ్మకాలపై ఉక్కుపాదం మోపుతున్నాం. ఇప్పటికే నిర్మల్, భైంసా ప్రాంతాల్లో దాడులు నిర్వహించాం. దాదాపు రూ.12 లక్షల విలువ చేసే గుట్కాను స్వాధీనం చేసుకుని పలువురిపై కేసులు నమోదు చేశాం. గుట్కాను అడ్డుకునేందుకు అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద నిఘాను పటిష్టం చేశాం. తనిఖీలను విస్తృతం చేస్తున్నాం. నిషేధిత గుట్కా, పాన్‌మసాలాను ఎవరైనా విక్రయించినా, కొనుగోలు చేసినా కఠిన చర్యలు తప్పవు. పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేసే దిశగా చర్యలు చేపడుతున్నాం. ఎవరైనా గుట్కాను విక్రయించినా, సరఫరా చేసినట్లయితే పోలీసులకు సమాచారం అందించండి. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం.*

*- నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల*











